క్లుప్తంగా

21 నుంచి రెండు రాష్ట్రాల స్థాయి కబడ్డీ పోటీలు

చిలుకూరు: మండలంలోని జెర్రిపోతులగూడెంలో గ్రామానికి చెందిన రణబోతు రంగారెడ్డి, గార్లపాటి జానకిరాములు 5వ వర్ధంతి సందర్భంగా భగత్‌సింగ్ యూత్ ఆధ్వర్యంలో ఈ నెల 21వ తేదీ నుంచి 23వ తేదీ వరకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాల స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు యూత్ సభ్యులు శుక్రవారం విలేకరులకు తెలిపారు. విజేత జట్లకు ప్రథమ బహుమతిగా రూ.75,016 నగదు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. అలాగే, రెండోవ బహుమతిగా రూ.50,016, మూడోవ రూ.35,016, నాలుగోవ రూ.25,016, ఐదోవ రూ.20,016, ఆరోవ రూ.15,016, ఏడోవ రూ.12,016, ఎనిమిదో బహుమతిగా రూ.10,016 నగదుతో పాటు బెస్ట్ రైడర్, బెస్ట్ క్యాచర్, బెస్ట్ డిఫెన్స్ టీమ్‌లకు ప్రత్యేక బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ క్రీడలను మ్యాట్‌పై నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయానికి రూ.2.16 లక్షల విరాళం


దాతను సన్మానిస్తున్న ఆలయ మఠాధిపతి

చిలుకూరు : చిలుకూరు గ్రామ శివారులోని శ్రీవీర బ్రహ్మేంద్రస్వామి ఆలయ ప్రహరీ నిర్మాణానికి సూర్యాపేటకు చెందిన కత్తురోజు బ్రహ్మచారి–ఆదిలక్ష్మి దంపతులు శుక్రవారం రూ. 2.16 లక్షల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో దాతను ఆలయ మఠాధిపతి పమ్మి బ్రహ్మయ్యచారి సన్మానించారు. అనంతరం బ్రహ్మయ్యచారి మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన


బాలుర ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ ఇమామ్


నడిగూడెం : ఈ నెల 27న నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్నందున నడిగూడెం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని శుక్రవారం ఎంపీడీఓ ఎస్‌డీ.ఇమామ్ పరిశీలించారు. ఈ సందర్భంగా మౌలిక వసతులు పరిశీలించారు. మండలానికి చెందిన 1313 మంది పట్టభద్రులు ఈ ఎన్నికల్లో ఓటు హక్కును సద్వినియోగం చేసుకోనున్నట్లు ఆయన తెలిపారు.

ఆలయ నిర్మాణానికి విరాళం అందజేత


ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు విరాళం అందజేస్తున్న దాతలు

హుజూర్‌నగర్ : మఠంపల్లి మండలంలోని మట్టపల్లిలో శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ నిర్మాణానికి హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన ముక్కా నరసింహారావు, కుమారులు పృథ్వీకుమార్, పునీత్‌లు శుక్రవారం రూ 51,116లు విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో నిర్మాణ కమిటీ సభ్యులు గెల్లి విద్యాసాగర్, ఓరుగంటి నరసింహారావు, వాసవి సేన మహిళా అధ్యక్షురాలు టి.సుజాత, టి.నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నర్సింగ్ దినోత్సవం


నర్సును సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

నేరేడుచర్ల : పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ నర్సింగ్ దినోత్సవాన్ని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నర్స్ స్వాతిని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు సౌమ్యశ్రీ, శృతి, లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు చల్లా ప్రభాకర్‌రెడ్డి, జిలకర రామస్వామి, సూర్యానారాయణరెడ్డి, శ్రీనివాస్‌రావు, యూసుఫ్, విశ్వనాథ్, సైదిరెడ్డి, సైదులు, వైద్య సిబ్బంది నర్సయ్య, హేమలత, జయమ్మ తదితరులున్నారు.

బియ్యం అందజేత

మోతె : మండల కేంద్రంలో గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి గుడిసెల్లో నివాసం ఉంటున్న సంచార జాతి వారి సామన్లు పూర్తిగా తడిశాయి. దీంతో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు సామ చిన వెంకటరెడ్డి, బొక్క ఉపేందర్‌రెడ్డి వారికి శుక్రవారం బియ్యం అందజేసి ఆదుకున్నారు.

అధ్వానంగా సాగర్ కాల్వ కట్టలు


రామాపురం వద్ద దెబ్బతిన్న సాగర్ ఎడమ కాల్వ లైనింగ్


తెల్లబల్లి వద్ద దెబ్బతిన్న కొమరబండ మేజరు కాల్వ

- దెబ్బతిన్న సాగర్ ప్రధాన కాల్వ లైనింగ్
- మేజర్, మైనర్ కాల్వలు అధ్వానం
- చివరి భూములకు అందని నీరు
- మరమ్మతులు చేపట్టాలని వేడుకోలు

నడిగూడెం : మండల పరిధిలో నాగార్జునసాగర్ ఎడమ కాల్వ కట్ట, దానికి అనుసంధానంగా ఉన్న కాల్వల కట్టలు అధ్వానంగా మారాయి. పలు చోట్ల కంపచెట్లు కమ్మేసి, కోతకు గురై ప్రమాదకరంగా తయారయ్యాయి. రామాపురం సమీపాన పలు చోట్ల లైనింగ్ పూర్తిగా దెబ్బతిన్నది. సిరిపురం డీప్‌కట్ వద్ద కూడా లైనింగ్ కొంత దెబ్బతినడంతో పాటు పలు చోట్ల వ్యవసాయ మోటార్ల నుంచి నీరు వస్తుండడంతో బుంగలు పడ్డాయి. రామాపురం వద్ద రెండేళ్ల క్రితం అత్యవసర పనుల కింద కాల్వ కట్టకు మరమ్మతులు చేసినా నాసిరకంగా చేపట్టడంతో మళ్లీ కట్ట నెర్రెలు బారుతున్నది.


సిరిపురం డీప్‌కట్ వద్ద దెబ్బతిన్న కాల్వ కట్ట


త్రిపురవరం వద్ద షట్టర్ లేని పాలారం మేజరు కాల్వ

ఆధునీకరణ పనులు చేపట్టినా..

సాగర్ ప్రధాన కాల్వకు అనుసంధానంగా కొమరబండ, కొత్తగూడెం, పాలారం మేజర్ కాల్వలు ఉన్నాయి. ఈ కాల్వలకు కోట్ల రూపాయల వ్యయంతో ఆధునీకరణ పనులు చేశారు. అయినా ఈ కాల్వల చివరి గ్రామాలకు నీరందడం లేదు. అయితే కొమరబండ మేజరు కాల్వ పరిధిలో రామాపురం, చాకిరాల, ఎకలాస్‌ఖాన్‌పేట, తండా, తెల్లబల్లి, కొమరబండ గ్రామాలున్నాయి. ఈ కాల్వ పలు చోట్ల లైనింగ్ దెబ్బతిన్నది. అలాగే కంపచెట్లు పెరగడంతో పాటు, పలు చోట్ల పూడడంతో చివరి భూములకు నీరందడం లేదని రైతులు అంటున్నారు. కొత్తగూడెం మేజరు కాల్వ పరిధిలో చాకిరాల, శ్రీరంగాపురం, రత్నవరం, వాయిలసింగారం, వసంతాపురం, అమీనాబాద్, శాంతినగర్, అనంతగిరి, గోల్‌తండా, గోండ్రియాల, కొత్తగూడెం, మంగళితండా గ్రామాలున్నాయి. ఈ కాల్వ పరిధిలోని గ్రామాలకు కూడా చివరి భూములకు నీరందడం లేదు. అలాగే పాలారం మేజరు కాల్వ పరిధిలోని సిరిపురం, వల్లాపురం, త్రిపురవరం, పాలారం గ్రామాలున్నాయి. ఈ కాల్వ అధ్వానంగా మారింది. దీంతో త్రిపురవరం, పాలారం గ్రామాలకు చివరి భూములకు నీరందకపోవడంతో అనేక మంది రైతులు బోర్లు, బావులు ఏర్పాటు చేసుకున్నారు. అలాగే మేజరు కాలువలకు అనుసంధానంగా ఉన్న పలు మైనర్ కాలువలకు షెట్టర్లు కూడా ఏర్పాటు చేయలేదు. ఈ మూడు మేజరు కాల్వల పరిధిలో దాదాపు 50 వేల ఎకరాల సాగు భూమి ఉన్నది. ప్రస్తుత వేసవిలోనైనా కాల్వలకు మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

కాల్వకట్టలు కుంగుతున్నాయి



సాగర్ ఎడమ కాల్వ పరిధిలో కట్టలు కుంగుతున్నాయి. సిరిపురం డీప్ కట్ సమీపంలో కాల్వ కట్ట దెబ్బతిన్నది. కాల్వకు పలు చోట్ల బుంగలు పడ్డాయి. అక్కడక్కడా కట్ట కంపచెట్లమయం అయింది. మేజర్ కాల్వ పరిస్థితి కూడా మరీ అధ్వానంగా ఉంది. మేజర్ కాల్వ ద్వారా పొలాలకు చాలీచాలని నీరే అందుతోంది.

– శెట్టి సతీష్, రైతు, సిరిపురం

చివరి భూములకు నీరందించాలి



పాలారం మేజర్ కాల్వ ద్వారా త్రిపురవరం, పాలారం, వల్లాపురం గ్రామాల చివరి భూములకు నీరు అందడం లేదు. లక్షల రూపాయలతో ఆధునీకరణ పనులు చేసినా తూములకు షట్టర్లు కూడా ఏర్పాటు చేయలేదు. పలు చోట్ల లైనింగ్‌లు పూర్తిగా దెబ్బతిన్నాయి. కంపచెట్లు పెరిగాయి. సంబంధిత అధికారులు స్పందించి చివరి భూములకు నీరందించాలి.

– మన్నెం నాగిరెడ్డి , రైతు త్రిపురవరం

కార్యకర్తలను కాపాడుకుంటా

- బీజేపీ నల్లగొండ ఎంపీ అభ్యర్థి సైదిరెడ్డి


నేరేడుచర్లలో విలేకరులతో మాట్లాడుతున్న శానంపూడి సైదిరెడ్డి

నేరేడుచర్ల: పార్టీ కార్యకర్తలకు ఏ కష్టమొచ్చినా కాపాడుకుంటానని హుజూర్‌నగర్ మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నల్లగొండ ఎంపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి అన్నారు. శుక్రవారం నేరేడుచర్లలోనీ బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికార పార్టీ నాయకుల ఆగడాలు, అక్రమ దందాలు పెచ్చుమీరిపోతున్నాయని, వాటిని తప్పనిసరిగా అడ్డుకొని తీరుతామన్నారు. ఇసుక, మట్టి, పేకాట మాఫియా మరలా వెలుగు చూస్తున్నాయని, ఇప్పటికే వేల కోట్ల రూపాయల అక్రమ సంపాదన సంపాదించారని ఆరోపించారు. నియోజకవర్గంలో అవినీతిపై పార్టీ కార్యకర్తలు ప్రశ్నించాలన్నారు. ఎవరిని ఇబ్బందిని పెట్టిన కూడా తనకు ఒక్క మెసేజ్ చేస్తే చాలని, తాను వెంటనే స్పందిస్తానన్నారు. నియోజకవర్గంలో ఇతర పార్టీలకు మనుగడలేకుండా చేయాలనే లక్ష్యంతో నాయకులు, కార్యకర్తలను పోలీసుల కేసుల్లో ఇరికించి భయపెట్టి కాంగ్రెస్ పార్టీలో చేర్చుకుంటున్నారన్నారు. పోలీసులను ప్రయోగించి విలేకరులపై కూడా దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. మొట్టమొదటి సారి నల్లగొండ గడ్డపై బీజేపీ జెండా ఎగురబోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర కమిటీ సభ్యులు బాల వెంకటేశ్వర్లు, మండల అధ్యక్షుడు పార్థనబోయిన విజయ్‌కుమార్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి, నాయకులు ఉరిమళ్ల రామ్మూర్తి, కాలం సైదులు, చింతకుంట్ల సోమిరెడ్డి, జగతయ్య, నాగయ్య, శంకర్‌రెడ్డి, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నించే గొంతుకకు మద్దతు తెలపాలి


మాట్లాడుతున్న ఒంటెద్దు నరసింహారెడ్డి

హుజూర్‌నగర్ : ప్రశ్నించే గొంతుకకు పట్టభద్రులందరూ మద్దతు తెలపాలని బీఆర్‌ఎస్ పార్టీ నియోజకవర్గ ఎన్నికల సమన్వయకర్త ఒంటెద్దు నరసింహారెడ్డి అన్నారు. శనివారం హుజూర్‌నగర్‌లో నిర్వహించిన బీఆర్‌ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ నిరుద్యోగులను అన్ని విధాల మోసం చేసిందని అన్నారు. గెలిచిన వెంటనే నిరుద్యోగ యువతకు కార్డులు అందిస్తామని దాని ద్వారా డబ్బులు డ్రా చేసుకోవచ్చని కాంగ్రెస్ నాయకులు ప్రగల్భాలు పలికారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ నాలుగు నెలల్లోనే ఆ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందన్నారు. ఆ వ్యతిరేకతే బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపిస్తుందని ఆయన తెలిపారు. పట్టభద్రులంతా ఐక్యంగా ఉండి ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీలు కొప్పుల సైదిరెడ్డి, జగన్ నాయక్, డీసీసీబీ డైరెక్టర్ రంగాచారి, నాయకులు సీహెచ్.కవిత, పచ్చిపాల ఉపేందర్, సీహెచ్.జయబాబు, కేఎల్ఎన్‌రెడ్డి, వెంకటరెడ్డి, నగేష్ రాథోడ్, నాయకులు పాల్గొన్నారు.

ఉద్యమకారులను పట్టించుకోవడం లేదు..

సమావేశంలో పలువురు ఉద్యమకారులు మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పార్టీలో కొందరికే ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ఉద్యమకారులను పట్టించుకోవడం లేదని వాపోయారు. ఉద్యమంలో పాల్గొని పార్టీకి సేవలు అందించిన వారిని పక్కన పెడుతున్నారని, కనీసం పార్టీ కార్యక్రమాలు, సమావేశాలకు కూడా పిలవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో స్పందించిన నాయకులు అందరిని ప్రాధాన్యత ఉంటుందని అన్నారు. ప్రతిఒక్కరిని కలుపుకుని పోతామని సర్దిచెప్పారు.

కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు మద్దతు


సమావేశంలో పాల్గొన్న జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు

హుజూర్‌నగర్ : నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, బీసీ సామాజిక వర్గానికి చెందిన తీన్మార్ మల్లన్నకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం పూర్తి మద్దతు తెలుపుతుందని ఆ సంఘం నియోజకవర్గ, పట్టణ అధ్యక్షులు డి.శ్రీనివాస్, బి.గోవిందరావు తెలిపారు. శనివారం హుజూర్‌నగర్ పట్టణంలో నిర్వహించిన ఆ సంఘం సమావేశంలో వారు మాట్లాడారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీలంతా తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు రాయల వెంకటేశ్వర్లు, బండి నాగేశ్వరరావు, ఉదారి యాదగిరి, ముషం సత్యనారాయణ, కొట్టు శేఖర్, సింగారపు వెంకన్న, కొండా లింగారావు, కర్నె కృష్ణ, నందిగామ ముక్కంటి, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యానికి రూ.500 బోనస్ హామీని నిలబెట్టుకోవాలి

మఠంపల్లి : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో భాగంగా వరి ధాన్యానికి క్వింటాకు రూ.500 బోనస్ చెల్లిస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు భూక్యా పాండునాయక్ డిమాండ్ చేశారు. శుక్రవారం మఠంపల్లిలో ఆ పార్టీ మండల కార్యదర్శి మాళోతు బాలునాయక్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం కేవలం సన్నరకాలైన ధాన్యానికి మాత్రమే బోనస్ చెల్లించే అవకాశం ఉందంటూ వస్తున్న వార్తలతో రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. అలాకాకుండా అన్ని రకాల వడ్లకు క్వింటాకు రూ.500 బోనస్ చెల్లించాలన్నారు. ముఖ్యంగా తెలంగాణలో 80 శాతం దొడ్డు రకం వరి ధాన్యం పండిస్తున్నారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సీపీఎం మండల నాయకులు జగన్ మోహన్‌రెడ్డి, సయ్యద్ రన్‌మియా, రాము, కోటయ్య, లింగయ్య, వెంకటరెడ్డి, తదితరులు ఉన్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవం


వేడుకలో పాల్గొన్న ఆలయ కమిటీ సభ్యులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని వేపలసింగారంలో వీరబ్రహ్మేంద్రస్వామి 331వ ఆరాధన మహోత్సవాన్ని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వీరబ్రహ్మేంద్రస్వామి చిత్రపటానికి పూలమాల వేసి, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ముడెం గోపిరెడ్డి, ఆలయ నిర్మాణ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు కడవెండి వెంకటాచారి, సోమవరపు వెంకటాచారి, అన్నెం కొండారెడ్డి, చక్కెర వీరారెడ్డి, శంభిరెడ్డి, చిన్నకోటిరెడ్డి, చిన్నప్ప, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

వాసవీ మాత జయంతి


బాలింతకు చీర అందజేస్తున్న క్లబ్ సభ్యులు

హుజూర్‌నగర్ : పట్టణంలో వాసవీ మాత జయంతిని వాసవీ క్లబ్, వాసవీ క్లబ్ వనిత లెజెండ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కామిశెట్టి శ్రీకాంత్ సౌజన్యంతో ఏరియా హాస్పిటల్‌లో ఆరుగురు బాలింతలకు చీరలు, చిన్నారులకు దుస్తులు పంపిణీ చేశారు. బ్రెడ్ ప్యాకెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు పి.స్రవంతి, టి.సుజాత, ఎస్.స్రవంతి, వి.రామ్ నరేష్, వి.సతీష్, కౌన్సిలర్ వి.నాగేశ్వరరావు, వి.వెంకయ్య, సీహెచ్.అనంతరాములు, బి.శ్రీను, ఎం.చిరంజీవి, ఎం.పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యంతోనే ప్రమాదాలు

మునగాల : కాంట్రాక్టర్ల నుంచి ముడుపులు తీసుకొని రోడ్డుపై ఉన్న విద్యుత్ స్తంభాలు, తాటిచెట్లను తొలగించకుండా ఆయా శాఖల అధికారులు చూసి చూడనట్లు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో మండలంలోని కొక్కిరేణి రోడ్డుపై తరచుగా ప్రమాదాలు సంభవిస్తున్నాయని పీవైఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ధారావత్ రవి ఆరోపించారు. శుక్రవారం ఆయన మునగాలలో విలేకరులతో మాట్లాడారు. కొక్కిరేణి రోడ్డును డబుల్ రోడ్డుగా మార్చే క్రమంలో రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాలు, తాటిచెట్లు తొలగించలేదని, దీంతో రాత్రివేళ ఈ రహదారిపై వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు రోజుల క్రితం ఓ ద్విచక్ర వాహనదారుడు విద్యుత్ స్తంబానికి ఢీకొట్టి గాయాల పాలవ్వగా, శుక్రవారం ఓ ఆటో విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో స్తంభం విరిగిపోయి రోడ్డుకు అడ్డంగా పడిపోగా ఆటో పల్టీ కొట్టిందని తెలిపారు. రహదారికి అడ్డంగా ఉన్న స్తంభాలు, చెట్లను తొలగించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని సంబంధిత శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం కన్పించలేదని, జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి ఈ విషయమై సంబంధిత శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని రవి కోరారు.

ఓటరు తుది జాబితా విడుదల

మునగాల : మండలంలోని పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల తుది జాబితాను శుక్రవారం తహసీల్దార్ వలిగొండ ఆంజనేయులు విడుదల చేసినట్లు మండల ఆర్‌ఐ రాధారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మండల వ్యాప్తంగా 2023 మంది పట్టభద్రులు ఉండగా వీరిలో 1402 మంది పురుషులు, 626 మంది మహిళలు ఉన్నారని తెలిపారు. ఈ నెల 27న జరగనున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆమె పేర్కొన్నారు.

వృద్ధులకు దుస్తుల పంపిణీ


దుస్తులు పంపిణీ చేసిన సిస్టర్లు, ప్రకాష్‌బాబు

మఠంపల్లి : మండల కేంద్రానికి చెందిన జ్యోతి ప్రకాష్ యువజన నాట్య కళామండలి అధ్యక్షుడు బోనగిరి ప్రకాష్‌బాబు తన తల్లి ఆగ్నేషమ్మ 36 వర్ధంతిని పురస్కరించుకుని సెయింట్ జోసెఫ్ వృద్ధాశ్రమంలో వృద్ధులకు శుక్రవారం దుస్తులు పంపిణీ చేసి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో సెయింటాన్స్ ఆశ్రమ ఇన్‌చార్జ్, సుపీరియర్ రెవరెండ్ సిస్టర్ రూబీ, హెచ్‌ఎం సిస్టర్ సుజాతలు పాల్గొని అన్నదానాన్ని ప్రారంభించారు. అనంతరం వారు ప్రకాష్‌బాబును అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ కమిటీ చైర్మన్ భద్రంరాజు వెంకటరామారావు, బోనగిరి ఆనంద్, బోనగిరి జోసుబాబు తదితరులు పాల్గొన్నారు.

బూరుగడ్డలో కుంకుమార్చన

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో ఉన్న శ్రీఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాల స్వామి దేవాలయంలో శుక్రవారం సహస్రనామ కుంకుమార్చనను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం సుప్రభాతసేవ, ఆరాధన, బాలభోగం, సేవాకాలం, స్వామివార్లకు పంచామృతాభిషేకం, మంగళాశాసనం, ఆరగింపు, తీర్థప్రసాద వితరణ నిర్వహించారు. అనంతరం భక్తులు గోమాతకు పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ లక్ష్మణరావు, అర్చకులు ముడుంబై శ్రీనివాసాచార్యులు, హరీష్‌కుమార్ చార్యులు, మనోహరాచార్యులు, ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు యరగాని భిక్షం, యరగాని నర్సింహారావు, గురవయ్య, వీరబాబు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.


గోమాతకు పూజ చేస్తున్న భక్తులు

మిషన్ భగీరథ పైపులైన్‌కు మరమ్మతులు


పైపులైన్‌కు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

నడిగూడెం : మండల కేంద్రంలోని ప్రధాన రహదారి వెంట, బీసీ కాలనీలో పలు చోట్ల మిషన్ భగీరథ పైపులైన్‌లు దెబ్బతిన్నాయి. దీంతో తాగు నీరు వృథాగా పోతోంది. శుక్రవారం స్థానిక పంచాయతీ కార్యదర్శి దుర్గాప్రసాద్ సంబంధిత సిబ్బందితో మరమ్మతులు చేయించారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

ఈదురుగాలులకు మామిడి రైతులకు నష్టం


రామాపురంలో విరిగిన మామిడి కొమ్మలు

నడిగూడెం : మండల కేంద్రంతో పాటు రామాపురం, ఎకలాస్‌ఖాన్‌పేట, తెల్లబల్లి, రత్నవరం, శ్రీరంగాపురం, చెన్నకేశ్వాపురం, కరివిరాల తదితర గ్రామాల్లో శుక్రవారం వీచిన భారీ ఈదురుగాలులకు మామిడి, నిమ్మ తోటల్లో కొమ్మలు విరిగాయి. ఈ వేసవిలో ఇప్పటివరకు నాలుగుసార్లు ఈదురుగాలులు వీయడంతో మామిడి, నిమ్మ రైతుల రైతులు నష్టపోయారని పండ్ల తోటల రైతు సంఘం రాష్ట్ర నాయకుడు ఏనుగుల వీరాంజనేయులు తెలిపారు. నష్టపోయిన తోటలను పరిశీలించి, నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఉపాధిహామీ చట్ట రక్షణకు ఉద్యమాలు చేస్తాం


సమావేశంలో మాట్లాడుతున్న మట్టిపల్లి సైదులు

కోదాడరూరల్ : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తుందని, ఆ చట్టం పరిరక్షణకు ఉధృతంగా ఉద్యమాలు చేపడతామని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టిపల్లి సైదులు అన్నారు. శుక్రవారం కోదాడ పట్టణంలోని సుందరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన 10 సంవత్సరాల కాలంలో ఉపాధి హామీ చట్టాన్ని తుంగలో తొక్కి కూలీలకు నష్టం జరిగేలా వ్యవహరిస్తుందని ఆయన ఆరోపించారు. బీజేపీ కేంద్రంలో రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధి హామీ చట్టంలో అనేక మార్పులు తీసుకొచ్చి కూలీల నోట్లో మట్టికొట్టిందని విమర్శించారు. చట్టాన్ని రక్షించుకునేందుకు ఈ నెల 24 నుంచి జూన్8 వరకు జిల్లా వ్యాప్తంగా మోటారు సైకిల్ యాత్ర నిర్వహించి కూలీల సమస్యలు తెలుసుకుంటామని తెలిపారు. జూన్ 10న వేలాది మంది కూలీలతో కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. అదే విధంగా కూలీలకు కనీస వేతనం రూ.600 ఇవ్వాలని, 200 రోజుల పనిదినాలు కల్పించాలని అన్నారు. పాన్ కార్డుతో సంబంధం లేకుండా కూలీలందరికీ ఉపాధి వేతనాలు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ కార్యదర్శి మిట్టగణుపుల ముత్యాలు, ఒగ్గు సైదులు, వెంకన్న, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

కలకోవ బీపీఎంపై కలెక్టర్‌కు ఫిర్యాదు

మునగాల : మండలంలోని కలకోవలో పోస్టల్ శాఖ బీపీఎం లక్ష్మయ్య విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నాడని, తన బదులు మరొక వ్యక్తితో ఉత్తరాలు బట్వాడా చేయిస్తున్నాడని గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త మండవ చంద్రయ్య శుక్రవారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా చంద్రయ్య స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఉపాధి హామీ కూలీలకు గత మార్చి నుంచి ఇప్పటి వరకు పనిచేసిన కూలి డబ్బులు ఇవ్వకుండా బీపీఎం లక్ష్మయ్య ఇబ్బందులకు గురిచేస్తున్నాడని ఆరోపించారు. ఒకరోజు విధులకు హాజరైతే పది రోజులు గైర్హాజరు అవుతున్నాడని, గ్రామంలో ఓ యువతి ద్వారా ఉత్తరాలు బట్వాడా చేయిస్తున్నాడన్నారు. పూర్తి విచారణ జరిపి అతనిపై తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరినట్లు చంద్రయ్య తెలిపారు.

ఉత్తరాలు బట్వాడా చేయని మాట వాస్తవమే..

విధుల పట్ల నిర్లక్ష్యంపై బీపీఎం లక్ష్మయ్యను వివరణ కోరగా.. తాను కలకోవలో బీపీఎంగా విధులు నిర్వరిస్తున్నానని, ఉత్తరాలు బట్వాడా చేయని మాట వాస్తవమేనని, గ్రామంలో ఓ వికలాంగురాలికి ఉపాధి కల్పించాలనే ఉద్దేశ్యంతో ఉత్తరాల బట్వాడాను ఆమెకు అప్పగిస్తున్నట్లు తెలిపారు. మార్చి నెలకు సంబంధించి ఉపాధి హామీ కూలీలకు డబ్బులు కూడా పంపిణీ చేశానని, మే నెలకు సంబంధించి ఈ రోజే పోస్టాఫీసు నుంచి తీసుకున్నానని వివరించాడు.

సీతానగరంలో ప్రమాదకరంగా సర్వీసు వైర్


సర్వీసు వైర్‌ను చూపిస్తున్న లక్ష్మణ్

మునగాల : మండలంలోని సీతానగరం గ్రామ పరిధిలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో విద్యుత్ స్తంభానికి సర్వీసు వైర్ ప్రమాదకరంగా ఉందని అయినా విద్యుత్ శాఖ సిబ్బంది పట్టించుకోవడం లేదని ఎస్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు గోగుల లక్ష్మణ్ శుక్రవారం తెలిపారు. గతంలో పాఠశాలకు విద్యుత్ సరఫరా నిమిత్తం ఏర్పాటు చేసిన సర్వీసు వైర్‌ను కట్ చేసి స్తంభానికి చుట్టి వదలివేయడంతో పరిసర ప్రాంత ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని తెలిపారు. ఈ వైర్‌కు విద్యుత్ సరఫరా అవుతున్నందున ప్రమాదవశాత్తు ఎవరైన తాకితే షాక్‌కు గురయ్యే ప్రమాదముందని, తక్షణమే సర్వీసు వైర్‌ను తొలగించాలని లక్ష్మణ్ కోరారు.

డబ్బులు వసూలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి


మత్స్య శాఖ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

హుజూర్‌నగర్ : మత్స్య కార్మికుల నుంచి సభ్యత్వాల పేరుతో డబ్బులు వసూలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకుడు ఎం.సీతయ్య కోరారు. ఈమేరకు శుక్రవారం సూర్యాపేటలోని మత్స్య శాఖ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త సభ్యత్వానికి డబ్బులు కట్టిన వారు మృత్యువాత పడ్డా వారికి ఇన్సూరెన్స్ వర్తించడం లేదని అన్నారు. కార్మికుల నుంచి డబ్బులు వసూలు చేసి మత్స్యశాఖకు చెల్లించని వారిపై చర్యలు తీసుకోవాలని అన్నారు. ఆయన వెంట నాయకులు ఎం.రాంగోపి, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

మూడు ముఖాలతో మామిడి



కోదాడ మండల పరిధిలోని కాపుగల్లు గ్రామానికి చెందిన రామ్‌నరేష్ మామిడి తోటలతో మూడు ముఖాలతో మామిడి కాయ కాసింది. శుక్రవారం తోటలో కాయలు కోస్తుండగా మూడు ముఖాలతో వింతకారంలో కాయ కనిపించింది. సాధారణంగా మామిడి కాయలు ఒక వైపు మొఖంతో ఉంటాయి కానీ ఆ కాయ మూడు ముఖాలు కలిగి వేర్వేరు ఆకారంలో కనిపిస్తుందని, ఈ కాయను స్థానికులు ఆసక్తిగా చూశారని రైతు తెలిపారు.

– కోదాడ రూరల్